# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 10 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తెలంగాణ ప్రభుత్వం "మీ టికెట్" యాప్ ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ సేవలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా "మీ టికెట్" యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా వివిధ రకాల టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు. ఆర్టీసీ, మెట్రో, ఆలయ దర్శనం, జూ పార్కులు, బోటింగ్, మ్యూజియంలు, వినోదం టిక్కెట్లు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్‌డీ) రూపొందించిన అధునాతన 'మీ టికెట్' యాప్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి తరహా యాప్ లను మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ యాప్ లో తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జూ పార్క్, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్ టైన్ మెంట్ జోన్స్ కు సంబంధించిన టికెట్లను తీసుకోవచ్చని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ యాప్ లొకేషన్ ఆధారిత సిఫార్సులను అందిస్తుంది. ఈ ఫీచర్ ద్వారా సమీపంలోని కమ్యూనిటీ హాళ్లు, జిమ్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల వంటి జీహెచ్‌ఎంసీ సౌకర్యాల కోసం బుక్ చేసుకోవచ్చు అని అన్నారు. ఈ యాప్ లో యూపీఐ చెల్లింపులు కూడా చేయవచ్చు. అందుకోసం ప్రత్యేకంగా ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని వెల్లడించారు.

## పంచాయతీ ఉద్యోగులకు
# గ్రీన్‌ఛానల్ ద్వారా జీతాలు



- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పనులపై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెల నెలా చెల్లించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, వారికి ప్రతి నెలా రూ. 116 కోట్లు జీతాలు చెల్లించాల్సి ఉంది. వారందరికీ ప్రతి నెలా గ్రీన్ చానెల్ ద్వారా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పనులపై ముఖ్యమంత్రి మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బిల్లులను తొందరగా చెల్లించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని, వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలని చెప్పారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన

# పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలి



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వరంగల్ (మామూనూరు) విమానాశ్రయ భూసేకరణ, ఇతర ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వరంగల్ మహా నగరంగా ఎదిగేలా విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్ (మామూనూరు) విమానాశ్రయ భూ సేకరణ, ఇతర ప్రణాళికలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కొచ్చి విమానాశ్రయం అన్ని వసతులతో ఉంటుందని.. దానిని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

వరంగల్ అవుటర్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని సీఎం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల ప్రజలు భవిష్యత్‌లో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల అభివృద్ధితో హైదరాబాద్‌ను ప్రతిబింబించేలా వరంగల్ ఎదిగేలా ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. వరంగల్ విమానాశ్రయం పూర్తయితే మేడారం జాతరతో పాటు లక్నవరం, రామప్ప ఇతర పర్యాటక ప్రదేశాలకు వచ్చే ప్రజలు సైతం దానినే వినియోగించుకుంటారని సీఎం తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కె.జయ్‌వీర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, వరంగల్ ఆర్డీవో సత్య పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క పైసా అవినీతి చెయ్యలేదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఒక పైసా అవినీతి, చిన్న తప్పుకానీ చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ' కేసు లేదు పీసు లేదు. ఇది ఒక లొట్టపీసు కేసు మాత్రమే. ఇందులో ఇంకా ఏం లేదు. ఈడికేలి పైసా పోయింది.. అక్కడ పైస ఉన్నది. అవినీతి ఎక్కడ జరిగిందని అడిగితే నీళ్లు నములుతున్నరు. అందుకే నేను రేవంత్‌రెడ్డిని అడుగుతున్న. నీకు పైశాచిక ఆనందం ఉంది. నేను జైలుకు వెళ్లినకాబట్టి అందరినీ జైలుకు పంపాలనే నీకు ఆనందం. నేను విదేశాలు తిరిగి పెట్టుబడులు తెచ్చినకాబట్టి నాకు విదేశాల స్థాయిలో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలని నాకుంది. నీకు, మాకు తేడా అదే'నన్నారు. 'ప్రపంచపటంలో హైదరాబాద్, తెలంగాణను పెట్టాలని మా నాయకుడు కేసీఆర్, మా కమిట్‌మెంట్. మేం నీలాగా రూ.50లక్షలతో దొరికిన దొంగలం కాదు. నీలా లుచ్చా పనులు చేసినోళ్లం కాదు.రాష్ట్రంలో ఎవరూ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి కింద చూస్తలేదు. ఎవరైనా ఏమన్నా అంటే కేసులు పెట్టి లోపటేస్తరు. ఆయనెవరో పేరు మరిచిపోయారని నేను అనను. ఎందుకంటే నిన్ను ఎవరూ గుర్తుపడుతలేరు. సంవత్సరం అయినా కూడా నిన్ను ఎవరూ దేకపోతే నేనేం చేయాలి? అందుకే పెద్దలు ఎప్పుడో చెప్పారు. కనపు సింహాసనమున శునకమును కూర్చుం డబెడితే.. దానికి ఆ బుద్ధి రాదు. అందుకే భయపడేది లేదు. బాధపడేది లేదు. ఎన్నిసార్లు పిలిచినా విచారణకు



వెళ్తా'నన్నారు.

కేసీఆర్ చెప్పినట్లుగా ఉద్యమంలో ఎంత కమిట్‌మెంట్‌తో పని చేసినమో.. అదే కమిట్‌మెంట్‌తో ముందుకు వెళ్దాం. వాళ్లు ఎన్ని ప్రశ్నలు వేసినా.. ఎన్ని సవాళ్లు విసిరినా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. కొత్త కొత్త కేసులు పెట్టినా భయపడేది లేదు. తలవంచేది లేదు. నిజాయితీకి ధైర్యం ఎక్కువ. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు విచారణకు పిలిచారా? అని పలువురు ప్రశ్నించగా.. వాళ్ల వద్ద అడిగేం దుకు ప్రశ్నలు లేవని.. రేవంత్‌రెడ్డి మళ్లీ పంపిస్తే పిలిస్తారు కావొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఇందులో ఏం ఉందని అడుగుతున్నరని తాను ఏసీబీ అధికారులను అడిగాన న్నారు.ఒక పైసా అవినీతి, చిన్న తప్పుకానీ చేయలేదని.. చేసినట్లు మీ కేసులో మీరే రుజువు చేయలేకపోతున్నారని అన్నట్లు తెలిపారు. న్యాయస్థానాలపై విశ్వాసం ఉందని, న్యాయస్థానాల్లో తేల్చుకుంటామని.. మళ్లీ పిలిస్తే విచారణకు వెళ్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఎక్కడివారంతా అక్కడ ప్రజాసమస్యలపై ప్రస్తావిస్తూ ముందుకు వెళ్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.



# సుదీర్ఘంగా కేటీఆర్ విచారణ

- ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో విచారించిన ఏసీబీ అధికారులు
- దాదాపు ఏడు గంటలు విచారణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో ప్రధాన నిందితుడైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు గురువారం సుదీర్ఘంగా విచారించారు. దాదాపు ఏడు గంటల పాటు సాగిన విచారణలో పలు ప్రశ్నలను ఏసీబీ దర్యాప్తు బృందం కేటీఆర్‌పై సంధించింది. ఏసీబీ ఇచ్చిన నోటీసు మేరకు ఉదయం పది గంటల తర్వాత కేటీఆర్ విచారణ కోసం బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. తన వెంట కోర్టు ఇచ్చిన అనుమతి మేరకు న్యాయవాదిని కూడా తీసుకొచ్చారు. కాగా, ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఒక గదిలో, ఆయన తరపు న్యాయవాదిని పక్క గదిలో ఉంచి విచారణ సాగించారు. ఆ గది నుంచి న్యాయవాదికి కేటీఆర్ కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు.

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణ విషయంలో విదేశీ కంపెనీతో ఎలాంటి ఒప్పందాలు చేసుకున్నారు? అందుకు అనుసరించి న విధానాలు ఏమిటి? ఇందుకోసం రూ.55 కోట్లు సదరు కంపెనీకి బదిలీ చేయటానికి హెచ్‌ఎండీఏ మాజీ కార్యదర్శి అరవింద్ కుమార్‌కు ఆదేశాలు ఇచ్చారా? ఆదేశాలు మౌఖికమా లేక లిఖితపూర్వకమా? తదితర ప్రశ్నలతో కేటీఆర్ విచారణను ఏసీబీ అధికారులు ప్రారంభించినట్టు సమాచారం. ఈ-కార్ రేసింగ్ నిర్వహణ కోసం ఎఫ్‌ఈఓ విదేశీ కంపెనీతో ఎలాంటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు? అందుకోసం రూ.55 కోట్లను హెచ్‌ఎండీఏ నిధుల నుంచి సదరు కంపెనీకి బదిలీ చేయాలని అరవింద్ కుమార్‌కు ఆదేశాలిచ్చారా? అని కూడా ఏసీబీ ప్రశ్నించినట్టు తెలిసింది. ఒక విదేశీ కంపెనీకి ఇంత పెద్ద మొత్తంలో మన కరెన్సీని బదిలీ చేసే సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతులు తీసుకోవాలని మీకు తెలియదా? అనే ప్రశ్నకు.. ఆ వ్యవహారాలను అధికారులు చూసుకుంటారని తాను భావించినట్టు కేటీఆర్ తెలిపారని సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌ను ప్రోత్సహించటం వలన హైదరాబాద్ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతుందనీ, దానితో పాటు దానికి అనుబంధంగా ఈ-కార్ల తయారీకి హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని భావించానని ఈ సందర్భంగా కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. గ్రీన్‌కో కంపెనీ నుంచి రూ.47 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఏ విధంగా సేకరించారని ప్రశ్నించగా.. ఈ కంపెనీ నుంచి ఇతర రాజకీయ పార్టీలు కూడా బాండ్ల రూపంలో నిధులు పొందాయని కేటీఆర్ తెలిపినట్టు సమాచారం.కేటీఆర్‌పై దాదాపు 50కి పైగా ప్రశ్నలను సంధించారని సమాచారం. కాగా, కొన్ని సందర్భాల్లో ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైందనీ, ఇందులో తాను ఎలాంటి పొరపాట్లకు పాల్పడలేదనీ, రాజకీయ ఒత్తిడితోనే కేసు పెట్టారని కేటీఆర్.. అధికారుల ముందు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. విచారణ అనంతరం తిరిగి ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు.

## యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కొత్త కోర్సులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కొత్త కోర్సులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నోటిఫికేషన్లు జారీ చేసింది. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న 17 ప్రాధాన్య రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు సరిపడే మానవ వనరులను తయారు చేసేలా కొత్త కోర్సులను ఐటీ, పరిశ్రమల శాఖ రూపొందించింది. తాజాగా కిమ్స్, ఏఐజీ ఆసుపత్రులు, టీవర్క్స్ భాగస్వామ్యంతో 3 కోర్సులకు నోటిఫికేషన్లను జారీ చేసింది. సంబంధిత రంగంలో పేరొందిన కంపెనీల భాగస్వామ్యంతో కోర్సులను రూపొందించి యువతకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు.. అదే కంపెనీలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు. త్వరలో మరిన్ని కోర్సులను ప్రారంభించేందుకు యూనివర్సిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# 'భూ భారతి'కి గవర్నర్ ఆమోదం

- వీలైనంత త్వరగా చట్టాన్ని అమలులోకి తెస్తాం
- ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలే సర్కార్ లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరలో ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూభారతి చట్టాన్ని రూపొందించామన్నారు. ఈ చట్టంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లు కాపీని



గురువారంసచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ చట్టం -2020 వల్ల తెలంగాణ రాష్ట్రంలో సామాన్య ప్రజలు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. భూ సమస్యలేని గ్రామం తెలంగాణలో లేదన్నారు. గత ప్రభుత్వం తమ వ్యక్తిగత స్వార్థం కోసం ప్రయోజనాల కోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు అందించడానికి మా ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాలలో రెవెన్యూ పాలనను చూడడానికి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని ఇందుకు సంబంధించిన కసరత్తు కొలిక్కివచ్చిందన్నారు.

# 95 శాతం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి

- ఫిర్యాదుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన 95 శాతం పూర్తయిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ లబ్దిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్ల గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకొచ్చామని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలోగల తన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఆయన ప్రారంభిస్తూ...ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu. telangana. gov.inకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యల వివరాలను ఫిర్యాదుదారుని మొబైల్ కు మెసేజ్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు.

"ఇందిరమ్మ లబ్దిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్లు గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకురావడం జరిగింది గ్రామాల్లో ఎంపీడీవో, పట్టణాల్లో మున్సిపల్



కమీషనర్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు వెళు ంది. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది,ఎలాంటి మధ్యవర్తులకు తావులేకుండా అర్హులైన వారికే ఇండ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటుంది. వీలైనంత త్వరితగతిన ఇండ్ల నిర్మాణా న్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈనెల 8వ తేదీనాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాలలో 95 శాతం పూర్తికాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88 శాతం పూర్తయింది. త్వరలో లబ్దిదారుల ఎంపిక పూర్తిచేసి ఇండ్ల నిర్మాణానికి చేపట్టవలసిన కార్యాచరణపై దృష్టి సారించాలని అలాగే అర్హులైన లబ్దిదారులకు ఇండ్లు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని అధికారులను సూచించారు.



## నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.

- ఏసీబీ అధికారులకు అన్ని విధాలా సహకరించా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. " ఏసీబీ వాళ్లు అడిగిన అన్ని ప్రశ్నలకు నాకున్న అవగాహన మేరకు సమాధానమిచ్చా ఏసీబీ ఎన్నిసార్లు పిలిచినా తప్పక వస్తానని చెప్పాను. ఏసీబీ పెట్టింది చెత్త కేసు... ఇందులో విషయమే లేదు. ఇది పూర్తిగా అసంబద్ధమైన కేసు అని చెప్పాను. ప్రభుత్వ ఒత్తిడితోనే ఈ కేసు పెట్టారని చెప్పా. కరప్షన్ ఎక్కడుంది అని ప్రశ్నిస్తే సమాధానమే లేదు.నాపై కేసు పెట్టి ఏదైనా సాధించాలనుకుంటే అది మూర్ఖత్వమే అవుతుంది. రేవంత్ రాసిచ్చిన నాలుగైదు ప్రశ్నలనే అటూ ఇటూ తిప్పి అడిగారు. ఎన్నిసార్లు పిలిచినా పూర్తిగా సహకారం అందిస్తా. ఇది రాజకీయ కక్షపూరితమైన కేసు అని ఏసీబీకి చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా" అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



# తిరుపతి ఘటనలో ఇద్దరు సస్పెండ్

- మరో ముగ్గురిపై బదిలీ వేటు
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం
- గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల పరిహారం

**క్షతగాత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శ**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తిరుపతి తొక్కిసలాట ఘటనలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయగా, మరో ముగ్గురిపై బదిలీ వేటు వేశారు. టోకెన్ పంపిణీ కేంద్రం వద్ద నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన డీఎస్పీ రమణకుమార్, అక్కడి గోశాల ఇన్ ఛార్జి హరినాథ్ రెడ్డిలపై సస్పెండ్ వేటు వేశారు. ఇక తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈఓ గౌతమి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్ లను బదిలీ చేస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తొక్కిసలాట ఘటనపై టీటీడీ పరిపాలన భవనంలో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జరిగిన సంఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు టీడీపీ ద్వారా రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు.. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని అన్నారు. ఈ ఘటనలో తిమ్మక్క, ఈశ్వరమ్మ అనే మహిళ లకు తీవ్ర గాయాలయ్యాయని, వారికి రూ.5 లక్షల చొప్పున సాయం అంది స్తామని తెలిపారు. అలాగే గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని అన్నారు. ఈ ఘటనతో బాధలో ఉన్నప్పటికీ వారిలో స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం ఉందని, 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని ఆయన చెప్పారు.తిరుమల పవిత్రతను కాపాడుతామని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు.

"ఈ తొక్కిసలాట ఘటన వార్త తెలిసి ఎంతో బాధపడ్డా. తిరుపతిలో ఎలాంటి దుర్ఘటనలు జరగకూడదని ఓ భక్తుడిగా కోరుకుంటా. ఘటనాస్థలిని పరిశీలించి ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించా. తిరుమల దివ్యక్షేత్రం పవిత్రత కాపాడే బాధ్యత తీసుకుంటా. ఇక్కడ రాజకీయాలు చేయడానికి వీల్లేదు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్లు ఇవ్వడం గతంలో లేని సంప్రదాయం. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచారు. ఎందుకు పెంచారో తెలియదు. మొదటి నుంచి ఉన్న సంప్రదాయలను మార్చడం మంచిది కాదు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలి. ఏ ఆలయంలోనూ అపచారం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పవిత్ర దినాల్లో దర్శనాలు సాఫీగా చేయించాల్సిన బాధ్యత అధికారులదే" అని ఆయన స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23వ తేదీ వరకు సీఎం విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును ఏసీబీ కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని, ఈ నేపథ్యంలో విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును రేవంత్ రెడ్డి అభ్యర్థించారు. ఇందుకు ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోర్టును రేవంత్ రెడ్డి కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన కోర్టు.. జులై 6వ తేదీలోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది. రూ.50 వేల సొంత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

ఈనెల 14వ తేదీన సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లనున్నారు. 15,16వ తేదీల్లో సిఎం ఢిల్లీ పర్యటన కొనసాగనుంది. 15న ఢిల్లీలో జరిగే ఏఐసిసి కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. 16వ తేదీన పలువురు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి అభ్యర్థించనున్నారు. అనంతరం ఈనెల 17వ తేదీన ఢిల్లీ నుంచి సిఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌కు వెళ్లనున్నారు. 17, 18వ తేదీల్లో సింగపూర్‌లో సీఎం రేవంత్ పర్యటిస్తారు. 19వ తేదీన సింగపూర్ నుంచి దావోస్‌కు ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. 23వ తేదీ వరకు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారు.

# మూడేండ్లలో పాలమూరు రంగారెడ్డి పూర్తి చేస్తాం..

- పాలమూరు జిల్లాను అన్నపూర్ణగా తీర్చిదిద్దుతాం
- పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం..
- ప్రజల కోసం నిలబడేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**బలగం టీవి, వనపర్తి**

మూడేండ్లలో పాలమూరు రంగారెడ్డి పూర్తి చేస్తామని.. పాలమూరు – వలసల జిల్లాలో సాగునీరుపారించి అన్నపూర్ణగా తీర్చిదిద్దు తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన వనపర్తి, నాగర్ కర్నూలు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కృష్ణా నదిపై కోయిల్ సాగర్, బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులు ప్రారంభించి పూర్తి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సైతం జీవో ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని తెలిపారు. కృష్ణా నదిపై ఎలిమినేటి మాధవరెడ్డి, శ్రీశైలం సొరంగం, డిండి వంటి ప్రాజెక్టులు ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తాం అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం హెూదాలో తాను, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ మంత్రి జూపల్లి లు కలిసి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల ప్రగతి పై సమీక్షించామని తెలిపారు. మీ అందరి కృషి వల్ల ప్రజా ప్రభుత్వం ఏర్పడింది

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. క్యాబినెట్ లోని మంత్రులందరూ 18 గంటల పాటు ప్రజల కోసం పనిచేస్తున్నారు.. పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్న ఆలోచన పార్టీ శ్రేణులు చేయాలని పిలుపునిచ్చారు.

రైతు రుణమాఫీ ఎక్కడ జరిగిందంటూ కేటీఆర్, హరీష్ అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. రైతు భరోసా ఐదు ఎకరాలకు ఇవ్వాలని, 10 ఎకరాలకు ఇవ్వాలని అభిప్రాయం వెల్లడించారు. ఈ విషయాన్ని శాసన సభలో చర్చకు పెట్టి. సాగు యోగ్యమైన భూములన్నిటికీ రైతు భరోసా ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. రైతు భరోసాను పదివేల నుంచి ఇందిరమ్మ ప్రభుత్వం 12 వేలకు పెంచిందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా 8400 కోట్లు నగదు జమ చేస్తాం అన్నారు.

ఎవరు ఆలోచన చేయని విధంగా భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద జనవరి 26 నుంచి 12 వేల నగదు వారి ఖాతాల్లో జమ చేయబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు అన్న కేసీఆర్ 10 సంవత్సరాల పాలనలో కరెంటు ఉత్పత్తి పరిశ్రమను ఒక్కదానిని పూర్తి చేయలేదు అన్నారు.




# ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ఆందోళన

**బలగం టీవి, చౌటుప్పల్**

రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం చౌటుప్పల్, వలిగొండ మండల్లాలోని వివిధ గ్రామాల రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధర్నా చేశారు. అనంతరం 65వ జాతీయ రహదారిపైన రాస్తారోకో కూడా చేశారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా 'మా భూములు మాకే కావాలి..కన్న తల్లి ముద్దురా ట్రిపుల్ ఆర్ వద్దురా.. ప్రాణం పోయినా సరే భూములు ఇవ్వం' అంటూ రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములను వదులుకునే ప్రసక్తే లేదని తెలిపారు. ఎన్నో రోజులుగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం ద్వారా తమ నిరసన అణచివేయడం సరైందికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.




# జీహెచ్ఎంసీ ఆఫీసు ముందు కాంట్రాక్టర్ల ఆందోళన

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్
- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న కాంట్రాక్టర్
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తానంటూ కాంట్రాక్టర్లకు కమిషనర్ హామీ

**బలగం టీవి, హైదరాబాద్**

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం హై టెన్షన్ నెలకొంది. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మే వరకు చేసిన పనులకుగానూ రూ.1100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన పనులు రూ.20 కోట్లు, ఇటీవల పార్లమెంటు ఎన్నికల సందర్భంలో చేసిన పనుల బిల్లులు మరో రూ.20 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే చెల్లించాలంటూ మంగళవారం నుంచి కాంట్రాక్టర్లు ఆందోళన బాట పట్టిన సంగతి తెలిసిందే. బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్లాలని నిర్ణయించారు.

బల్దియా హెడ్ ఆఫీస్ ముందు వారు ఆందోళన చేశారు. చేసిన పనులకు బిల్లులు అందక అప్పుల పాలవుతున్నామని, అప్పుల బాధ భరించలేక పలువురు కాంట్రాక్టర్లు గుండెపోటుతో మరిణించారని, ఇలా అయితే చిన్న కాంట్రాక్టర్లు ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల ఐక్యత వర్ధిల్లాలని, కమిషనర్ బయటకు రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానంటూ, పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఓ కాంట్రాక్టర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఇతర కాంట్రాక్టర్లు అడ్డుకొని రక్షించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అప్రమత్తమైన పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు కార్యాలయం లోపలకి రాకుండా గేట్లు మూసివేసి వారిని అడ్డుకున్నారు. దాంతో గేటు వద్దే బైఠాయించిన కాంట్రాక్టర్లు కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రస్తుత కమిషనర్ ఇలంబర్తి తమను పట్టించుకోవడం లేదని, కనీసం తమ సమస్యలను వినడానికి కూడా సిద్ధంగా లేరని ఆరోపించారు. గతంలో పనిచేసిన కమిషనర్లు తమతో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా చూశారన్నారు. పోలీసులను మోహరించి తమను అరెస్టులు చేయించాలని కమిషనర్ చూస్తున్నారని, ఇది సరైనది కాదంటూ వారు వాపోయారు. ఇదిలావుండగా కాంట్రాక్టర్లను తన ఛాంబర్‌కు పిలిపించుకున్న కమిషనర్ సమస్యపై చర్చించారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాంటూ కాంట్రాక్టర్లకు కమిషనర్ హామీనిచ్చినట్టు సమాచారం.

# శంషాబాద్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన



**బలగం టీవి, హైదరాబాద్**

శంషాబాద్‌లో చెరువులపై హైడ్రా ఫోకస్ పెట్టింది. చారినగర్ లో కబ్జాలకు గురైన గొల్లవానికుంట, ధర్మోజికుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. సుమారు 23 ఎకరాలు ఉండా ల్సిన చెరువు పూర్తిగా కనిపించకుండా పోయిందని, ఇంత జరుగుతున్నా ఎందుకు పట్టించుకోలేదని ఇరిగేషన్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో పరిశీలించి కబ్జాకు గురైన కుంటలను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కబ్జా చేసిన వ్యక్తులకు వెంటనే నోటీసులు అందజేసి అక్రమాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజుల్లో తిరిగి ఈ ప్రదేశాన్ని సందర్శిస్తానని తెలిపారు. ధరణి పోర్టల్ లో శంషాబాద్ విలేజ్ పేరు లేకపోవడంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఈ అంశాన్ని పరిశీలిస్తానని తెలిపారు. పూర్తిగా కబ్జాలకు గురైయ్యేం త వరకు అధికారులు తిరిగి చూడకపోవడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన చర్యలు తీసుకోకపోతే అధికారులపై కూడా చర్యలు తీసుకో వాల్సి వస్తుందని హెచ్చరించారు.




## సౌత్ ఇండియా యూనివర్సిటీ చదరంగం పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు

**బలగం టీవి, హైదరాబాద్**

చెన్నైలో శుక్రవారం నుంచి జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ చదరంగం పోటీలకు కరీంనగర్ లోని జీనియస్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్టు చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి కనకయ్య, కోచ్ కంకటి అనూప్ కుమారులు తెలిపారు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో రాణించిన శ్రీనిజ, స్వాతి, నితిన్, అరుణ్, జేఎన్టీయూ నుండి వరుణ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం అకాడమీలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను వారు అభినందించారు సౌత్ ఇండియా పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని సూచించారు. క్రీడాకారుల ఎంపిక పట్ల కోచ్ లు సృజన్, అనూష్, అభిరామ్, రేవిక్ , తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు..

# సంక్రాంతి పండుగకి ఉరికెళ్తున్నారా.. జాగ్రత్త చర్యలు తీసుకోవాలి..

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సంక్రాంతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల, కాలనీ, ఆపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్, ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చోరీల నియంత్రణకు గ్రామాల్లో,పట్టణాల్లో ముమ్మర పెట్రోలింగ్ చేయడం జరుగుతుందని,దీనికి అనుగుణంగా జిల్లా ప్రజలు సైతంపోలీస్ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. "ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు తమతో పాటే తీసుకెళ్లాలి. సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ను ఏర్పాటు చేసుకోండం మంచిది. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో లేదా మీ గ్రామ పోలీస్ అధికారికిసమాచారం ఇవ్వండి. వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిది. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్ గా నియమించుకోవాలి. సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలి. ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని, పరిసరాలను లైవ్/ ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు. సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. ఊరు వెళున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కట్టిన వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చుమని చెప్పాలి. ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నది. మీ గ్రామం, పట్ట ణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేయండి. పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ చోరీల నియంత్రించడం సులభం అవుతుందని ఎస్పీ తెలిపారు.

## గుడి చెరువు,మూల వాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ పట్టణంలోని గుడి చెరువు, మూల వాగులోకి మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో మూలవాగులోకి, గుడి చెరువులోకి మీరు కలవకుండా చేస్తానని ఇచ్చిన హామీ మేరకు వేములవాడ పట్టణంలోని బెడ జంగాల కాలనీ నుండి కట్టు కాలువ మీదిగా న్యూ అర్బన్ కాలని వరకు 2 కోట్ల 30 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగింది. ఇప్పటికే 2 కోట్ల 90 లక్షలతో న్యూ అర్బన్ కాలనీ నుండి గుడి చెరువులోకి మురుగునీరు కలవకుండా జగిత్యాల బస్టాండు వరకు డ్రైనేజీ నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అలాగే రూ. 3 కోట్ల 80 మూల వాగులోకి మురికి నీరు కలవకుండా డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగింది.



## రూ.1,033 కోట్లతో శబరిమల అభివృద్ధి..

**బలగం టీవీ , శబరిమల**

కేరళలోని ప్రసిద్ధ శబరిమలను రూ.1,033.62 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సన్నిధానం, పంపా, ట్రక్ రూట్ వంటి కీలక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి బ్లూప్రింట్ రూపొందించారు. మొత్తం రూ.778.17 కోట్ల వ్యయంతో సన్నిధానం ప్రాంతాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశ పనులకు రూ. 600.47 కోట్లు, 2028-2033 మధ్య చేపట్టనున్న రెండో దశ పనులకు రూ. 100.02 కోట్లు, 2034-39 మధ్య చేపట్టనున్న మూడో దశ పనులకు రూ.77.68 కోట్లు కేటాయించనున్నారు. కాగా, అయ్యప్ప స్వామి సన్నిధానం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతకు భంగం కలుగకుండా లేఅవుట్ ప్లాన్ రూపొందించినట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాంతాన్ని ఎనిమిది జోన్‌లుగా విభజించినట్లు పేర్కొంది. మకరవిళక్కు (మకర జ్యోతి) దృశ్యాలు కనిపించేలా, భక్తుల రద్దీని నియంత్రించేలా రెండు ఓపెన్ ప్లాజాలు నిర్మించనున్నట్లు వెల్లడించింది.

మరోవైపు అటవీ మార్గంలో ప్రయాణించే యాత్రికుల సురక్షితం, సౌకర్యం కోసం వాహన రూట్ లేఅవుట్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మార్గంలో షెల్టర్లు, విశ్రాంతి భవనాలు నిర్మిస్తారు. రోడ్డుకు రెండు వైపులా అత్యవసర వాహన లేన్, పర్యావరణ పునరుద్ధరణ కోసం బఫర్ జోన్‌లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ. 47.97 కోట్ల వ్యయంతో ట్రక్ రూట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. తొలి దశ పనులకు రూ.32.88 కోట్లు, రెండో దశ పనులకు రూ.15.50 కోట్లు కేటాయించనున్నారు. కాగా, పంపా అభివృద్ధికి రూ.207.48 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు. మొదటి దశకు రూ. 184.75 కోట్లు, 2028-33 మధ్య రెండో దశ పనులకు రూ.22.73 కోట్లు కేటాయిస్తారు. శబరిమల మాస్టార్ ప్లాన్ ప్రకారం పంపా, ట్రక్ రూట్ అభివృద్ధికి కలిపి మొత్తం రూ. 255.45 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

## నిధి అగర్వాల్‌కు సోషల్ మీడియాలో వేధింపులు..!

**బలగం టీవీ , హైదరాబాద్**



ఇటీవల మలయాళీ నటి హనీరోజ్.. సోషల్ మీడియా ద్వారా తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో నటికి కూడా ఫిర్యాదు చేసింది. కథానాయిక నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొంది. ఈ విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియా ద్వారా ఓ వ్యక్తి తనను ఇబ్బందికి గురిచేస్తూ, వేధిస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు తనను చంపేస్తానంటూ బెదిరింపు కామెంట్స్ పెడుతున్నట్లు తెలిపింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. నటి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.

కాగా, నిధి అగర్వాల్ ప్రస్తుతం రెండు భారీ ప్రాజెక్ట్స్ చేస్తోంది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో 'హరిహర వీరమల్లు', పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్'లో నటిస్తోంది. ఈ రెండు పాన్‌ఇండియా సినిమాలూ 2025లోనే విడుదల కానున్నాయి.

## బండ్లగూడలో కుప్ప కూలిన స్లాబ్

- ఏడుగురు కార్మికులకు గాయాలు

**బలగం టీవీ, బండ్లగూడ**

రంగారెడ్డి జిల్లా బండ్లగూడలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద సెంట్రింగ్ స్లాబ్ కుప్ప కూలింది. నిర్మాణంలో ఉన్న భవనంపై వద్ద స్లాబ్ సెంట్రింగ్ ను కార్మికులు కొడుతుండగా సెంట్రింగ్ ఒక్కసారిగా కుప్ప కూలింది. ఈ ఘటనలో 7 మంది కార్మికులకు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిర్మాణ సంస్థ ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని నిర్మాణ సంస్థను అధికారులు,స్థానికులు మండిపడ్డారు.స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి బండ్లగూడ జాగీర్ మేయర్ లతా ప్రేమ్ గౌడ్ చేరుకొని ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

## తెలంగాణ టూరిజంపై నాగార్జున స్పెషల్ వీడియో

**బలగం టీవీ, హైదరాబాద్**

పర్యాటకులు తెలంగాణకు రావాలని, ఇక్కడ అద్భుతమైన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని సినీ నటుడు అక్కినేని నాగార్జున కోరారు. తెలంగాణ టూరిజం అభివృద్ధిలో భాగంగా పర్యటకులను ఆహ్వానిస్తూ ప్రత్యేక వీడియోలో ఆయన మాట్లాడారు. ఇందులో తెలంగాణలో ప్రదేశాలు, ఆయనకు నచ్చిన ఆహారం తదితర విషయాలను పంచుకున్నారు. ఈ వీడియోను షేర్ చేసిన తెలంగాణ టూరిజం నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. ఇక నాగార్జున సినిమాల విషయానికొస్తే, లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలి'లో నటిస్తున్నారు. రజనీకాంత్‌తో కలిసి నాగార్జున నటిస్తున్న తొలి సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.

# విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , వేములవాడ**

ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించామని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. గురువా రం రాష్ట్రంలోనే ప్రప్రథ మంగా జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కెజిబివి) లలో ఐఐటి, జేఈఈ, నీట్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా లోని రుద్రంగి, చందుర్తి, వేములవాడ రూరల్ మండలం లోని మర్రిపల్లి కెజిబివిల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమర్ ఝా కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం చందుర్తి, మర్రిపల్లి లోని పాఠశాలలో స్టోర్ రూం, వంటగదిలను, భోజనశాలను పరిశీలించారు. నిత్యవసరాలను, బియ్యం, కూరగాయలను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. చందుర్తిలో టాయిలెట్స్ నిర్మాణం చేపడతామని,పాఠశాలలో పిచ్చి మొక్కలు, గడ్డి వంటి వాటిని తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.చందుర్తి కేజీబీవీ పాఠశాలకు నూతన రంగులు వేయాల్సిందిగా ఆదేశించారు. విద్యార్థులను ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రుద్రంగిలోని కేజీబీవీ లో ఇప్పటికే ప్రహరీ గోడ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయనీ అన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రాజాన్న సిరిసిల్ల జిల్లా లోని 13 కెజిబివి లలో అమలు చేస్తున్నామని, ఐఐటి, జేఈఈ, నీట్,యూజి ఫౌండేషన్ కోర్సులను ఆన్లైన్ కోచింగ్ , లైవ్ క్లాసెస్ చెప్పి, విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి అవకాశం, వారంతరాల్లో టెస్టులు నిర్వహిస్తారన్నారు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేజీబీవి లలో ఆన్లైన్ క్లాసులు ప్రారంభించడం అభినందనీయమనిఅన్నారు . డిల్లీ, హైద్రాబాద్, రాజస్థాన్, కోట లలో ఇచ్చే కోచింగ్ అన్ అకాడమీ సౌజన్యంతో ముందుకు పోతున్నారనీ,కోచింగ్ సద్వినియోగం చేసుకొని ఐఐటి, జేఈఈనీట్ లలో సీట్లు సాధించాలనీ ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారని, ఇప్పటికే డైట్ చార్జీలు 40%, కాస్మోటిక్ చార్జీలు 200% పెంచారని,రాష్ట్రంలోనే విద్యార్థులందరికీ ఒకే రకమైన నాణ్యమైన రుచికరమైన పౌష్టిక ఆహారం అందించడానికి ఒకే మెను తయారుచేసి అందిస్తున్నామనిఅన్నారు .



ఉపాధ్యాయులు చెప్పేది వింటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు పోవాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం నాణ్యమైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తుందని తెలిపారు. విద్యా రంగానికి పెద్ద పీట వేస్తూ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను చేపట్టినని తెలిపారు. శిక్షణ తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. 10వ తరగతిలో 10/10 జి.పి.ఏ సాధిస్తే స్వయానా వచ్చి సన్మానం చేస్తానని హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ సహాయంతో..**

ఐఐటి, జేఈఈ,నీట్ యు.జి. ఫౌండేషన్ కోర్సులను జిల్లాలోని కేజీబీవీపీలలో అందించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఇచ్చే కోచింగ్ ప్రభుత్వ సహాయంతో కేజీబీవి లో అందిస్తున్నామని,తాను మధ్యతరగతి కుటుంబం నుండి ఈ స్థాయికి వచ్చానని అన్నారు .ఈ కోర్సుల వలన మధ్యతరగతి కుటుంబాలలోని విద్యార్థులకు ప్రవేట్ పాఠశాలలో కోచింగ్ సెంటర్లలో లభించే కోచింగ్ కేజీబీవీ లలో లభిస్తుందని, వారు అనుకున్న లక్ష్యాలు చేరుకునే మంచి అవకాశం ఉందనిఅన్నారు . దేశంలోనే ఉత్తమ సంస్థల్లో అందించే కోచింగ్ ను ఇక్కడ అందుబాటులో ఉంచుతామనిఅన్నారు .ఈ కార్యక్రమం లో విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, రుద్రంగి, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు చేలకల తిరుపతి, రోండి రాజు, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్ లో, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఉన్నారు.

# టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ..



**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణ టీచర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా క్యాలెండరును సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి బి. జగన్మోహన్ రెడ్డి టిటియు నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యా ప్రమాణలను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మరియు రాబోయే పదవ తరగతి ఫలితాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్టం లోనే మొదటి స్థానంలో నిలిపెందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.పదవ తరగతి విద్యార్థులకు సాయంకాలం స్టడీ అవర్ ఉన్నందున అల్పాహారం అందించెందుకు కృషి చేయాలనీ అన్నారు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంబీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారులు దూస రఘుపతి, భూక్యా రాజు, రాజిరెడ్డి, గంగారాం, కృష్ణహరి,టి.టి.యు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండికొప్పుల రవి, తడుకల సురేష్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్వర్గం రాధకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డిమల్ల మాణిక్యం,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు యాద రవి, దూస మధు, జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ రవి, మడికంటి మల్లేశం, గంగారపు చిరంజీవి, వంగాల తిరుపతి రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలు కె.పావని,జిల్లా కార్యదర్శులు బూర సుమన్, కొండికొప్పుల మంజుల, బి. స్వాతి,అలిశెట్టి శ్రీకాంత్,రాజలింగం, రామ్ బాబు, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డాకుమహారాజ్‌లో విజువల్స్ అద్భుతం



బలగం టీవీ, హైదరాబాద్

నందమూరి బాలకృష్ణ దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న చిత్రం డాకు మహారాజ్. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కాబోతుండగా ఈ క్రమంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక ప్రగ్యా జైస్వాల్, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఆమె మాట్లాడుతూ "2015 లో తెలుగులో నా సినీ ప్రయాణం మొదలైంది. ఈ ప్రయాణంలో ఎందరో ప్రముఖ నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులతో కలిసి పని చేసి, సినిమా గురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. పలు మంచి సినిమాల్లో భాగమయ్యాను. మరిన్ని మంచి సినిమాలతో

● ప్రగ్యా జైస్వాల్

అలరించడానికి ప్రయత్నిస్తున్నాను బాలకృష్ణ గారితో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. కోవిడ్ సమయంలో ఎవరూ పెద్దగా సినిమా చేయలేదు. అలాంటి సమయంలో బోయపాటి శ్రీను గారు అఖండ కథ చెప్పి, అంత గొప్ప సినిమాలో నన్ను భాగం చేశారు. ఆ సినిమా ఘన విజయం సాధించి, నా సినీ కెరీర్ ని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు డాకు మహారాజ్ లాంటి మరో మంచి సినిమాలో బాలకృష్ణ గారితో కలిసి నటించడం సంతోషంగా ఉంది. డాకు మహారాజ్ కూడా ఘన విజయం సాధిస్తుందని, ఈ చిత్రంలోని నా పాత్రను ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను.

ఇందులో నేను కావేరి పాత్ర పోషించాను. నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర ఇది. డీ గ్లామరస్ రోల్ చేశాను. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. కావేరి పాత్రను బాబీ గారు డిజైన్ చేసిన తీరు బాగుంది. ఈ పాత్ర నాకు నటిగా ఛాలెంజింగ్ గా అనిపించింది. కావేరి పాత్రతో పాటు ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది.బాబీ గారు నాకు ఎప్పటి నుంచో తెలుసు. ఆయన దర్శకత్వంలో నటించే అవకాశం ఇంత కాలానికి వచ్చింది. బాబీ గారు అద్భుతమైన దర్శకుడు. మంచి మనిషి. సెట్స్ లో చాలా కూల్ గా ఉంటారు. నటీనటులను ఒత్తిడికి గురి చేయకుండా, వారి పనిని తేలిక చేసి, మంచి నటనను రాబట్టుకుంటారు. బాబీ గారు కథ చెప్పినప్పుడే ఇది మంచి చిత్రం అవుతుందని నమ్మాను. నేను ఊహించిన దానికంటే గొప్పగా ఈ చిత్రాన్ని రూపొందించారు. బాలకృష్ణ గారిని సినిమాలో చాలా కొత్తగా చూపించారు. విజువల్స్ కూడా అద్భుతంగా ఉంటాయి.బాలకృష్ణ గారికి సినీ పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్నప్పటికీ, ఇంకా కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నాగవంశీ గారు గొప్ప నిర్మాత. దర్శకులను, టీంని ఎంతో నమ్ముతారు. అందరిని స్వేచ్ఛగా పని చేసుకోనిస్తారు. వంశీ గారు తక్కువ మాట్లాడతారు.. కానీ ఎప్పుడూ మంచి సినిమాలను అందించడానికి తపిస్తూ ఉంటారు." అని అన్నారు.

"మన సినీ పరిశ్రమలో ఉన్న గొప్ప సంగీత దర్శకులలో తమన్ గారు ఒకరు. ముఖ్యంగా బాలకృష్ణ గారి సినిమాల్లో ఆయన సంగీతం మరింత గొప్పగా ఉంటుంది. 'డాకు మహారాజ్' చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించారు. నాకు ది రేజ్ ఆఫ్ డాకు సాంగ్ ఎంతగానో నచ్చింది. దబిడి దిబిడి, చిన్న సాంగ్స్ కూడా బాగున్నాయి. పాటలతో పాటు ఈ చిత్ర నేపథ్య సంగీతం కూడా బాగుంటుంది" అని చెప్పారు.

"పుట్టినరోజు ప్రతి ఏడాది వస్తుంది. కానీ బాలకృష్ణ గారి సినిమా అనేది ఒక సెలబ్రేషన్ లాంటిది. ఆయనతో కలిసి నేను నటించిన సిని మా నా బర్త్ డేకి విడుదల కావడం నా అదృష్టం. ఇది నా పుట్టినరోజుకి ఒక పెద్ద బహుమతిగా భావిస్తున్నాను. అలాగే నేను నటించిన సినిమా సంక్రాంతి లాంటి పెద్ద పండుగకు విడుదలవుతుండటం కూడా ఎంతో సంతోషంగా ఉంది. మా డాకు మహారాజ్ తో పాటు ఈ సంక్రాంతికి విడుదలవుతున్న గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు కూ డా విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.




## శ్రీలంక పర్యటనకు ఆస్ట్రేలియా జట్టు రెడీ..

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంక పర్యటన కోసం ఆస్ట్రేలియా గురువారం జట్టును ప్రకటించింది. లంకలోని పిచ్‌లను దృష్టిలోపెట్టుకొని క్రికెట్ ఆస్ట్రేలియా ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లకు అవకాశం కల్పించింది. ఆసిస్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌కు లంక సిరీస్‌కు విశ్రాంతినివ్వగా.. స్టీవ్ స్మిత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుత కెప్టెన్ కమ్మిన్స్ కొడుకు పుట్టడంతో స్మిత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. భారత్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో మూడో టెస్ట్ తర్వాత ఉద్వాసనకు గురైన నాథన్ మెక్‌స్వీనికి మళ్లీ చోటు కల్పించింది. ఆస్ట్రేలియా ఇప్పటికే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకుంది. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగే ఫైనల్‌లో ఆస్ట్రేలియా తలపడనున్నది. శ్రీలంక పర్యటనలో ఆస్ట్రేలియా రెండు టెస్టులు ఆడనున్నది. ఈ రెండు మ్యాచులు గాలే స్టేడియంలోనే జరుగనున్నాయి.

ఆస్ట్రేలియా యువ ఆటగాడికి శ్రీలంక పర్యటనకు ఎంపిక చేసింది. 21 ఏళ్ల కూపర్ కొన్నోలీని ఎంపిక చేసింది. 16 మంది సభ్యుల జట్టులో ఏడుగురు స్పెషలిస్ట్, పార్ట్–టైమ్ స్పిన్ బౌలర్లు ఉన్నారు.

**ఆస్ట్రేలియా జట్టు**

స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ, కూపర్ కొన్నోలీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, శామ్ కాన్‌స్టాస్, మాట్ కుహ్నెమాన్, మార్నస్ లాబుస్‌చగ్నే, నాథన్ లియాన్, నాథన్ మెక్‌స్వీనీ, టాడ్ మర్ఫీ, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్.




## భారత్ పాక్ మ్యాచ్ రద్దు

బలగం టీవీ, హైదరాబాద్

ఆట ఏదైనా భారత్– పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. అయితే జనవరి 13 నుంచి జరగనున్న ఖోఖో ప్రపంచకప్‌లో భారత్– పాకిస్థాన్ జట్ల మధ్య జరగాల్సి ఉన్న మ్యాచ్ రద్దయింది. భారత్ వేదికగా జనవరి 13న ఖోఖో ప్రపంచకప్ ప్రారంభం కానుంది. జనవరి 13న ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్ ఓపెనింగ్ సెర్మనీ గ్రాండ్‌గా జరగనుంది. ఇక అదే రోజు 13న భారత్– పాకిస్థాన్ మహిళల జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే పాకిస్థాన్ మహిళల జట్టు భారత్‌కు రాలేకపోతోంది. ఈ మేరకు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటన విడుదల చేసింది. 2025 ఖోఖో ప్రపంచ కప్ తొలి ఎడిషన్‌లో పాకిస్థాన్ పాల్గొనదని కేకేఎఫ్‌ఐ తాజాగా వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం జనవరి 13న భారత్–పాకిస్థాన్‌తో తలపడాల్సి ఉంది. కానీ, వీసా సమస్యల కారణంగా పాకిస్థాన్, భారత్?కు రాలేకపోతోంది.దీంతో తొలి మ్యాచ్‌లో భారత్, నేపాల్ ను ఢీకొట్టనుంది. ఈ మేరకు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటన విడుదల చేసింది. ఖోఖో ప్రపంచకప్‌నకు 40 జట్లకు బదులు 39 పాల్గొంటున్నాయని అందులో తెలిపింది.

'ఖోఖో ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని ఆశించాం. కానీ, అలా జరగలేదు. విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్ ప్లేయర్ల వీసా దరఖాస్తు ఆమోదించలేదు. దీంతో దాదాపు వా రు ఖోఖో ప్రపంచకప్‌లో ఆడడం కష్టమే' అని ఖోఖో ప్రపంచ కప్ సీఓఓ గీతా సుడాన్ తెలిపారు.




## ఆసక్తిగా అను ఇమ్మాన్యుయేల్.. 'బూమరాంగ్' ఫస్ట్ లుక్

బలగం టీవీ, హైదరాబాద్




అను ఇమ్మాన్యుయేల్ , శివ కందుకూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ బూమరాంగ్ . హార్రర్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ప్రముఖ సినిమాటోగ్రఫర్ ఆండ్రీవ్ బాబు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విక్టరీ వెంకటేష్ చేతుల మీదుగా విడుదలైంది. ఈ పోస్టర్ ఆసక్తి కలిగిస్తుంది. చీకట్లో ఉన్న ఓ ఇంటి ముందు శవాలు కనిపిస్తుండగా.. ఓ వ్యక్తి వాటి మధ్యలో నుంచి కుక్కను పట్టుకుని వస్తుండటం చూడొచ్చు. వెనుకాల ఇల్లు.. మరోవైపు అనూ ఇమ్మాన్యుయేల్ ఇంటెల్స్ లుక్స్ ఇలా ప్రతిదీ సస్పెన్స్ క్రియేట్ చేస్తుంది. ఈ సినిమాని బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, మై3 ఆర్ట్స్ బ్యానర్లపై లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి ఊట్ల నిర్మిస్తున్నారు. సితార ఫిలిమ్స్ లిమిటెడ్ ఈ చిత్రానికి లైన్ ప్రొడక్షన్ పనులు చూసుకోనుంది. సినిమాటోగ్రఫర్ కం డైరెక్టర్ ఆండ్రీవ్ సినిమాల విషయానికి వస్తే.. రామ్ నటించిన కందిరీగ, ఎందుకంటే ప్రేమంటే, సాయి దుర్గ తేజ్ నటించిన తేజ్ ఐ లవ్ యూ సినిమాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేశాడు.

## దూసుకుపోతున్న 'గేమ్ చేంజర్' బుకింగ్స్

బలగం టీవీ, హైదరాబాద్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' అడ్వాన్స్ బుకింగ్స్‌లో దూసుకుపోతోంది. బుక్ మై షోలో ప్రతి గంటకు అడ్వాన్స్ బుకింగ్ సేల్స్ పెరుగుతున్నాయి. ఏవరేజ్ లెక్క చూస్తే... ప్రతి గంటకు ఆల్మోస్ట్ 30 వేల టికెట్లు సేల్ అవుతున్నాయి.తెలంగాణలో పూర్తి స్థాయిలో గురువారం (జనవరి 9న) బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. అది పరిగణనలోకి తీసుకుంటే... సేల్స్ బాగున్నట్టే. మరో వైపు డిస్ట్రిక్ యాప్ లో కూడా సేల్స్ చాలా బావున్నాయి. పేటీఎంలోనూ ట్రెండ్ బావుంది.




## డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు

బలగం టీవీ, హైదరాబాద్

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుపతిలో టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకుని డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేసుకున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది . సంక్రాంతి పండుగకు బాలకృష్ణ నటించిన డాకు మహారాజు సినిమా ఈనెల 12 విడుదల కానుంది. సితార బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమాకు బాబి కొల్లి దర్శకత్వం వహించగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా వ్యవహరించారు. ప్రముఖ దర్శకుడు తమన్ ఈ సినిమాకు సంగితం వహించారు. ఈ సందర్భంగా గురువారం అనంతపురంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. తిరుపతిలో జరిగిన ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా 40 మందికి పైగా గాయపడ్డారు.. ఈ ఘటనపై సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందిస్తూ తిరుపతిలో భక్తులు చనిపోవడం అత్యంత బాధాకరమనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అప్పటివరకు మోహన్‌బాబుపై ఎలాంటి చర్యలు వద్దు

బలగం టీవీ, హైదరాబాద్



నటుడు మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబుపై నమోదైన హత్యాయత్నం కేసులో బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. విచారణ నాలుగు వారాలు వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు మోహన్‌బాబుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు పంపించింది.